సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో నిత్యాన్న దాన ట్రస్టుకు బుధవారం కలిదిండి చిన వెంకట రామరాజు, ఉమా పార్వతి (గొంది) దంపతులు రూ.50 వేల విరాళం అందజేశారు.



ట్యాబ్.. స్విచ్ఛాఫ్

పేద విద్యార్థుల ఉన్నతి కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ట్యాబ్‌లను ఉచితంగా అందజేసింది. వాటిని ప్రస్తుత కూటమి సర్కారు పట్టించుకోవడం లేదు.

8లో

అన్నదాన పథకానికి రూ.లక్ష



అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కోసరాజు శివకుమార్ (ఆకివీడు) బుధవారం రూ.లక్ష విరాళం అందజేశారు.

న్యూస్‌రీల్

ఎస్‌జీఎఫ్ మహిళా విభాగ జిల్లా కార్యదర్శిగా రమాదేవి



కొత్తపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మహిళా విభాగ జిల్లా కార్యదర్శిగా కొత్తపేట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల పీడీ ఏఎస్ఎస్ రమాదేవి నియమితులయ్యారు. గత నెల 26న అమరావతిలో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు నిర్వహించిన ఇంటర్వ్యూకు రమాదేవి హాజరు కాగా ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ బుధవారం ప్రొసీడింగ్స్ పంపారు. ఆ మేరకు 2025-26 విద్యా సంవత్సరం ఎస్‌జీఎఫ్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ నిర్వహణ బాధ్యతలు చేపట్టినట్టు ఆమె తెలిపారు. రమాదేవిని ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కె.లీలావతి, జెడ్పీజీహెచ్ఎస్ హెచ్ఎం ఎస్.సత్యనారాయణ, పీడీలు, పీఈటీలు అభినందించారు.

శనైశ్చరుని ఆలయంలో హుండీల ఆదాయం లెక్కింపు



మందపల్లి ఆలయంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, అర్చకులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన కొత్తపేట మండలం మందపల్లి ఉమామందేశ్వర (శనైశ్చర) స్వామివారి దేవస్థానంలో హుండీల ద్వారా రూ 10,06,005 ఆదాయం వచ్చినట్టు దేవస్థానం ఈఓ దారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు. జిల్లా దేవదాయ శాఖ అధికారి, సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, దేవదాయ శాఖ అమలాపురం, రాజమహేంద్రవరం ఇన్‌స్పెక్టర్ టీవీఎస్ఆర్ ప్రసాద్ పర్యవేక్షణలో ఈఓ సురేష్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం హుండీలను తెరిచారు. వారి సమక్షంలో దేవస్థానం సిబ్బంది, భక్తులు, స్థానికులు నగదును లెక్కించారు. 8 నెలల 11 రోజులకు హుండీ ద్వారా రూ.8,80,131, అన్నప్రసాద ట్రస్ట్‌కు రూ.85,357, దేవస్థానం క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామి ఆలయం హుండీ ద్వారా రూ.40,517 ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలిపారు. మందపల్లి ఎంపీటీసీ సభ్యుడు సిద్దంశెట్టి వీవీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు సాదు చెంచయ్య, గ్రామ కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, కొత్తపేట వీఆర్వో యు.సీతాసుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ విరమించుకోవాలి



జాన్ మోషే

మలికిపురం: వైద్య కళాశాలలు ప్రైవేట్‌పరం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బూశి జాన్‌మోషే డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మలికిపురంలో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు వైద్య విద్యను దూరం చేయడానికి వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తూ క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడంతో బహుజన విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకువచ్చిన పీపీపీ విధానం ఆయన సామాజిక వర్గానికి ప్రయోజనంగా ఉందే తప్ప, దీనివల్ల బహుజనులకు ప్రయోజనం లేదన్నారు. వైద్య కళాశాలలు ప్రైవేట్ పరిధిలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని అన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన నాయకులు మెడికల్ సీట్లను కోట్లాది రూపాయలకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ప్రైవేటీకరణ వైపే అడుగులు వేస్తుంటారని, తను క్యాబినెట్‌లో ఉన్న మంత్రి నారాయణ విద్యా సంస్థలు నడుపుతున్నవారికి మెడికల్ కళాశాలను ధారాదత్తం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు ఉందన్నారు.

క్రీడా పోటీలకు ఎంపికలు

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్ -14, 17 బాల బాలికలకు ఈ నెల 12, 19 తేదీల్లో క్రీడా పోటీలు, ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ డాక్టర్ షేక్ సలీమ్ బాషా ఓ ప్రకటనలో తెలిపారు. 12న ఫెన్సింగ్ ఎంపికలు సఖినేటిపల్లి మండలం మోరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, 19న మాల్కంబ్ క్రీడలో ఎంపికలు మలికిపురం మండలం గుడిమెళ్లంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతాయన్నారు. ఇతర వివరాలకు ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు కొండేపూడి ఈశ్వరరావు- 93469 20718, ఎస్ఎస్ రమాదేవి - 94400 34084 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని అన్నారు.

జీవితాలతో ఆటోలాడొద్దు

- స్త్రీ శక్తి పథకంతో రోడ్డున పడిన కార్మికులు
- నిరసనిస్తూ రేపు, ఎల్లుండి ఆటోల బంద్
- ఎన్నికల హామీని పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఏడాదికి రూ.15 వేలు ఎప్పటికి ఇస్తారో!



అమలాపురంలో జరిగిన ఆందోళనలో మాట్లాడుతున్న జిల్లా ఆంధ్ర ఆటోవాలా యూనియన్ అధ్యక్షుడు సత్తిరాజు



ఐ.పోలవరంలో ఆందోళన చేస్తున్న ఆటో కార్మిక సంఘాల జేఏసీ నాయకులు, కార్మికులు

సాక్షి, అమలాపురం: జీవితాలతో ఆటలాడుతున్నారు.. సాఫీగా సాగిపోతున్న ప్రయాణానికి బ్రేక్‌లు వేశారు.. ఆటో కార్మికులకు ఉపాధి దూరం చేశారు.. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చకపోగా, రోజువారీ ఆదాయానికి గండి పెట్టడాన్ని కార్మికులు జీర్ణించుకోలేకపోతున్నారు. స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో రోడ్డున పడ్డామని ఆటో కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఆటోలకు గిరాకీ లేక ఆదాయం సగానికి పడిపోవడంతో పాటు పెరిగిపోతున్న ఫైనాన్స్ భారాన్ని మోయలేక రోడ్డెక్కారు. దశల వారీగా ఆందోళనలకు సిద్ధమయ్యారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఆటో కార్మికుల ఆందోళనలు ఉధృతం చేశారు. ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం తీసుకు వచ్చిన తరువాత కార్మికుల రోజువారీ ఆదాయానికి భారీగా గండి పడింది. గతంలో రోజుకు రూ.వెయ్యి వరకూ ఆదాయం చూసిన కార్మికులకు ఇప్పుడు రూ.300 నుంచి రూ.500 కూడా రావడం లేదు. దీనితో జిల్లాలో సుమారు 25 వేలకు మందికి పైగా ఉన్న కార్మికుల జీవనోపాధికి గండి పడినట్టయ్యింది. మారుమూల గ్రామీణ ప్రాంతాలకు కొంత వరకూ సర్వీసు ఉంది. ముఖ్యంగా పల్లె వెలుగు బస్సులు వెళ్లని గ్రామాలకు వెళ్లే ఆటో కార్మికులకు వచ్చే ఆదాయం పెద్దగా తగ్గలేదు. ఉదాహరణకు అమలాపురం నుంచి ఉప్పలగుప్తం మీదుగా ఎస్.కొత్తపల్లి, కూనవరం, అమలాపురం మండలం సాకుర్రు, అంబాజీపేట మండలం వాకలగరువు, తొండవరం, ఐ.పోలవరం మండల కేంద్రానికి, మురమళ్ల నుంచి టి.కొత్తపల్లి, ముమ్మిడివరం మండలం సలాదివారి పాలెం, లంకాఫ్ ఠాణేల్లంక, మలికిపురం మండలం అప్పనరామునిలంక, గుడిమెల్లంక వంటి బస్సు సర్వీసులు లేనిచోట ఆటో కార్మికులకు పెద్దగా ఇబ్బంది లేదు. ఒకటి, రెండు బస్సు సర్వీసులు ఉన్నచోట కొంత వరకూ ఆదాయం తగ్గగా, అధిక సర్వీసులు తిరిగే అమలాపురం నుంచి రావులపాలెం, రావులపాలెం మీదుగా బొబ్బర్లంక, వాడపల్లి, రాజోలు నుంచి అమలాపురం, రాజోలు నుంచి పి.గన్నవరం మీదుగా రావులపాలెం, అమలాపురం నుంచి ముమ్మిడివరం, మురమళ్ల మీదుగా యానాం, అమలాపురం నుంచి ముక్తేశ్వరం, అమలాపురం నుంచి కాట్రేనికోన, అమలాపురం నుంచి అల్లవరం, యానాం నుంచి రామచంద్రపురం, మండపేట మీదుగా రావులపాలెం వంటి బస్సులు అధికంగా తిరిగే రూట్లలో ఆటో కార్మికుల ఉపాధి మూడొంతులు పడిపోయింది. అమలాపురం బస్టాండ్ నుంచి రావులపాలెం బస్టాండ్‌కు వెళ్లేందుకు ఆటో సర్వీసులు దాదాపు నిలిపివేశామని కార్మికులు చెబుతున్నారు. ఇదే సమయంలో తనిఖీలు, ఫిట్‌నెస్, పొల్యూషన్ పేరుతో ఎడాపెడా ఫైన్లు రాస్తుండడంతో వారి ఇబ్బందులు రెట్టింపయ్యాయి. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ ప్రైవేట్ కంపెనీలకు అప్పగించారు. దీనిని అమలాపురం మండలం ఎ.వేమవరంలో ఏర్పాటు చేశారు. జిల్లాకు ఇదొక్కటే కావడంతో రామచంద్రపురం, మండపేట, ఆత్రేయపురం, సఖినేటిపల్లి వంటి సుదూర మండలాల నుంచి ఇక్కడకు వచ్చి సర్టిఫికెట్ పొందడం కూడా వారికి భారంగా మారింది.

ప్రభుత్వం పట్టించుకోక..

ప్రధాన మార్గాల్లో ఆదాయం కోల్పోవడం ఆటో కార్మికుల రోజువారీ జీవనానికి సైతం కష్టాలు వచ్చాయి. ఇతర మార్గాల్లో ఆటోలు తిప్పుతుంటే ఇతర కార్మికుల నుంచి అభ్యంతరాలు వస్తున్నాయి. నిత్యం సర్వీసులు తిరిగే మార్గాల్లో ఆదాయం లేకుండా పోయింది. అన్ని ఖర్చులూ పోను రోజుకు రూ.వెయ్యి వరకు ఆదాయం వచ్చేచోట ఇప్పుడు రూ.మూడు వందలు కూడా రావడం లేదని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. దీనితో వారు నిరసన బాట పట్టారు. ఇప్పటికే జిల్లాలో దశల వారీగా ఉద్యమాన్ని చేపట్టారు. ఆటోలకు నల్ల జెండాలు కట్టి నిరసన తెలుపుతున్నారు. మండలాల వారీగా రాస్తారోకోలు, ధర్నాలు, ఆటోలతో ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేనందున ఈ నెల 12, 13వ తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ఆటోల బంద్ నిర్వహించాలని నిర్ణయించారు.

అప్పులు చేస్తున్నాం..



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసిన నాటి నుంచే ఆటోల్లో ప్రయాణించే వారి సంఖ్య గణనీయంగా తగ్గింది. ఎవరూ ఆటోలు ఎక్కడానికి ఇష్టపడడం లేదు. ప్రస్తుతం ఆటో ఈఎంఐలకు అప్పు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. రోజంతా కష్టపడినా కనీసం రూ.500 కూడా రావడం లేదు. ఇంటి ఖర్చులకు అప్పులు చేస్తున్నాం. ప్రభుత్వ సాయం చేయాలి.

-మోకా శ్రీనివాసరావు, జిల్లా ఆంధ్ర ఆటోవాలా యూనియన్ జిల్లా కోశాధికారి, అమలాపురం

హామీ నిలబెట్టుకోవాలి



మహిళలకు ఉచిత బస్సు ప్రవేశ పెట్టడంతో రవాణా రంగం పై ఆధారపడిన ఆటో, టాటా మేజిక్, చిన్న కార్ల నిర్వాహకులు ఉపాధి కోల్పోయారు. ఉచిత బస్సు పథకం ద్వారా రవాణా రంగ కార్మికులు నష్టపోతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి రూ.15 వేల చొప్పున రెండేళ్లకు కలిపి రూ. 30 వేల సాయం లక్షణం అందించాలి. ప్రభుత్వం ఆదుకోకపోతే కార్మికులు రోడ్డున పడాల్సి వస్తుంది.

-యల్లమిల్లి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ టీయూ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం

హామీ.. పట్టదేమీ!

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైఎస్సార్ వాహన మిత్ర పథకంలో భాగంగా ఆటో కార్మికులకు ఏడాదికి రూ.10 వేల చొప్పున నేరుగా వారి ఖాతాల్లో జమ చేసేది. దీనివల్ల జిల్లాలో వేలాది మంది కార్మికులు రూ.కోట్ల మేర లబ్ధి పొందారు. ఆటో మరమ్మతులు, రోడ్ ట్యాక్స్, ఇతర అవసరాల కోసం వినియోగించుకునేవారు. తాము అధికారంలోకి వస్తే ఆటో కార్మికునికి ఏడాదికి రూ.15 వేలు అందజేస్తామని టీడీపీ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చింది. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి ఎన్నికల సభలో తాము ఏడాదికి రూ.15 వేలు అందజేస్తామని చెప్పుకొచ్చారు. కానీ ఇప్పటికీ ఆ ఊసెత్తడం లేదు. ఈ ఏడాదితో కలిపి ఒక్క ఆటో కార్మికునికి రూ.30 వేలు చొప్పున ఇవ్వాల్సి ఉంది. అదీ ఇవ్వక, వచ్చే ఆదాయ మార్గం లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.

డ్రైనేజీ వ్యవస్థ మెరుగుకు ప్రణాళిక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: చమురు సంస్థల సీఎస్ఆర్ నిధులతో తీర ప్రాంతంలో మత్స్య సంపద అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. బుధవారం రాజమహేంద్రవరం ఓఎన్జీసీ క్షేత్రస్థాయి ఇంజినీర్ కేవీకే రాజు, గ్రీన్ యూనిట్ ఎన్జీఓ దుర్గేష్ గుప్తాలు, స్థానిక అధికారులతో కలసి చెయ్యేరులో తాగునీటి చెరువు అభివృద్ధి పనులు, కూనవరం సముద్ర మొగ పూడికతో డ్రైన్ల మురుగు నీరు సముద్రంలో కలవక తరచూ పంటలు ముంపు బారిన పడడం, సముద్ర తీర ప్రాంత రక్షణకు మడ అడవుల అభివృద్ధి, మత్స్య సంపద అభివృద్ధి, తీర ప్రాంతం వెంబడి పర్యావరణ హితంగా గ్రీన్ బెల్ట్ ఏర్పాటు వంటి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అమలాపురం కలెక్టరేట్‌లో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధుల ద్వారా తీర ప్రాంత ప్రజలకు జీవనోపాధుల పెంపునకు కృషి చేస్తున్నామన్నారు. తీర ప్రాంత రక్షణలో భాగంగా కందికుప్ప, వాసాలతిప్ప ప్రాంతాల్లో మడ అడవుల అభివృద్ధికి చేపడుతున్న కార్యాచరణ పనులతో తదుపరి సమీక్షకు హాజరు కావాలని జిల్లా అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. కూనవరం మొగ నుంచి మురుగు పోయేలా ప్రతిపాదనలపై అధ్యయనం చేయాలన్నారు. డీఆర్వో కొత్త మాధవి, జిల్లా మత్స్యశాఖ అధికారి పీవీ శ్రీనివాసరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్రావు, గ్రీన్ క్లైమేట్ ఫండ్ అధికారి శ్రీహర్ష, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు



విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.సాయి వరప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. అమలాపురం పట్టణం ఏవీఆర్ నగర్‌లోని జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ భవనంలో జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ పెన్షనర్లకు 12వ పే కమిషన్ నియమించి, 30 శాతం ఇంటిరీయం రిలీఫ్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 11వ పే రివిజన్ ఎరియర్లు చెల్లించకపోవడంతో రూ.లక్షల ఎరియర్లు అందకుండానే చాలా మంది పెన్షనర్లు కాలం చేస్తున్నారన్నారు. సీనియర్ పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ తగ్గింపు దారుణమని అన్నారు. పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వీఎస్ఎస్‌సీహెచ్ కృష్ణమూర్తి పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. జిల్లా కార్యదర్శి కేకేవీ నాయుడు సమావేశంలో కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం పాలెపు మాణిక్యాంబ జ్ఞాపకార్థం ఆమె సోదరులు పాలెపు సత్యనారాయణ, వెంకటరమణ సౌజన్యంతో 80 ఏళ్లు పైబడిన ఎనిమిది మంది సీనియర్ ఉపాధ్యాయ పెన్షనర్లను సత్కరించారు. ఇకపై ప్రతి ఏటా ఉపాధ్యాయ దినోత్సవం నాడు ఈ ఎనిమిది మందిని సత్కరించడమే కాకుండా అందుకు శాశ్వత నిధి సమకూర్చుతామని పాలెపు సోదరులు ప్రకటించారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఐవీ శ్రీనివాసరావు, కట్టా రామకృష్ణ, కె.సత్యనారాయణాచార్యులు, గుర్లింక సత్యనారాయణ, వై.పాండురంగారావు, జి.భీమరాజు, ఎస్.జగన్‌మోహనరావు, డీఎల్ఎన్ సోమయాజుల దంపతులను సత్కరించారు. సమావేశంలో పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులు మండలీక ఆదినారాయణ, కలిగినీడి ఉదయ భాస్కర్, శిష్టా శ్రీహరి, మెహబూబ్ సహీరా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ కమిటీల్లో 13 మందికి చోటు

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర పార్టీ అనుబంధ కమిటీల్లో జిల్లా నుంచి 13 మంది నేతలకు చోటు కల్పిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం బుధవారం నియామక ఉత్తర్వులు ఇచ్చింది. పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా బొక్కా వెంకటలక్ష్మి (కొత్తపేట నియోజకవర్గం), పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అఫీషియల్ స్పోక్స్‌మెన్‌గా కాశి బాల మునికుమారి (ముమ్మిడివరం నియోజకవర్గం), పార్టీ రాష్ట్ర మహిళా విభాగం సంయుక్త కార్యదర్శిగా నీతిపూడి విలసిత మంగతాయారు (పి.గన్నవరం నియోజకవర్గం), పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శులుగా కాలకూరి హరినాథ్ (కొత్తపేట నియోజకవర్గం), నడింపల్లి సూరిబాబు రాజు (ముమ్మిడివరం నియోజకవర్గం), పార్టీ రాష్ట్ర వీవర్స్ వింగ్ సంయుక్త కార్యదర్శిగా సాల సత్య సుబ్రహ్మణ్యం (మండపేట నియోజకవర్గం), పార్టీ రాష్ట్ర ఐటీ వింగ్ సంయుక్త కార్యదర్శిగా భూపతిరాజు శివ సూర్యనారాయణరాజు (సుధీర్‌వర్మ) (కొత్తపేట నియోజకవర్గం), పార్టీ రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ కార్యదర్శిగా ముసునూరి వెంకటేశ్వరరావు (కొత్తపేట నియోజకవర్గం), పార్టీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కార్యదర్శిగా సంద్ర నాగమోహన్‌రెడ్డి (కొత్తపేట నియోజకవర్గం), పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ సంయుక్త కార్యదర్శిగా పల్నాటి శామ్యూల్ రెడ్డి జయపాల్ (కొత్తపేట నియోజకవర్గం), పార్టీ బూత్ కమిటీల వింగ్ ప్రధాన కార్యదర్శిగా మార్గన గంగాధరరావు (కొత్తపేట నియోజకవర్గం), పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ కార్యదర్శులుగా కొల్లి శ్యామ్‌సన్ (కొత్తపేట నియోజకవర్గం), పెన్మత్స చిట్టిరాజు (ముమ్మిడివరం నియోజకవర్గం) నియమితులయ్యారు. వీరిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, ముమ్మిడివరం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అభినందించారు.

ప్రభుత్వం మెడలు వంచుదాం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి




గోపాలపురంలో మాజీ మంత్రి సూర్యారావు, పరిశీలకుడు పాపారాయుడిని సత్కరిస్తున్న జగ్గిరెడ్డి

రావులపాలెం: హామీలు అమలు చేయకుండా, ప్రజా వ్యతిరేక విధానాలతో పాలన సాగిస్తున్న ప్రభుత్వం మెడలు వంచి పథకాలు సాధిద్దామని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నిర్వహించిన 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమంలో రాజోలు నియోజకవర్గంలో సుమారు 1,355 ఇళ్లకు తిరిగి క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి, పీడీఎఫ్ అప్లోడ్ చేసినందుకు ఆ నియోజకవర్గం రాష్ట్రంలో 4వ ర్యాంకు, జిల్లాలో ఫస్ట్ ర్యాంకు సాధించింది. ఆ నేపథ్యాన్ని పురస్కరించుకుని రాజోలు నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావును, అమలాపురం, రాజోలు నియోజకవర్గాల పార్టీ పరిశీలకునిగా నియమితులైన కర్రి పాపారాయుడును జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి బుధవారం రావులపాలెం మండలం గోపాలపురంలోని ఆయన స్వగృహంలో ఘనంగా సత్కరించారు.

చదువుల సరస్వతి.. దుర్గాదేవి

హోమియోపతి వైద్య విద్యలో ట్రిపుల్ ధమాకా



విజయవాడలో వైస్ చాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న దుర్గాదేవి

రాయవరం: హోమియోపతి వైద్య విద్యలో రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన గుంటూరి దుర్గాదేవి ప్రతిభ కనబర్చింది. బ్యాచిలర్ ఆఫ్ హోమియోపతిక్ మెడిసిన్ అండ్ సర్జరీ (బీహెచ్ఎంఎస్) పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. రాజమహేంద్రవరంలోని అల్లు రామలింగయ్య హోమియోపతి కళాశాలలో దుర్గాదేవి బీహెచ్ఎంఎస్ డిగ్రీ పూర్తి చేశారు. బీహెచ్ఎంఎస్ కోర్సు పూర్తి చేసిన సందర్భంగా మంగళవారం విజయవాడలోని హెల్త్ యూనివర్సిటీలో నిర్వహించిన స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ సమక్షంలో మూడు అవార్డులు కైవసం చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పరీక్షల్లో ఫస్టియర్ నుంచి ఫైనల్ ఇయర్ వరకూ ప్రథమ స్థానంలో నిలిచినందుకు బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ అవార్డుగా న్యాపతి వెంకట శ్రీనివాసరావు బంగారు పతకాన్ని పొందారు. ఫస్టియర్ నుంచి ఫైనలియర్ వరకూ అధిక మార్కులు సాధించినందుకు డాక్టర్ సూరపనేని చంద్రమౌళి ఎండోమెంట్ పురస్కారం అందుకున్నారు. అదేవిధంగా ఆంధ్రాయూనివర్సిటీ పరిధిలో ఫస్ట్ ఎటెంప్ట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక మార్కులు సాధించినందుకు దివంగత డాక్టర్ ఎం.గురురాజు సిల్వర్ మెడల్‌ను సాధించారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..

నా తల్లి బాలనాగకోటేశ్వరి ఇచ్చిన ధైర్యం, పట్టుదలతో ముందడుగు వేశాను. తండ్రి కృష్ణ చిన్న హోటల్ వ్యాపారం చేస్తూ నన్ను కష్టపడి చదివించారు. వారిచ్చిన ప్రోత్సాహం, గురువులు చూపిన మార్గదర్శకత్వంతోనే ఈ విజయాలు సాధించాను. ప్రస్తుతం జయసూర్య పొట్టి శ్రీరాములు ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేషన్ (ఎండీ) కోర్సు చేస్తున్నాను. నా భర్త కొప్పినీటి మణిబాబు స్ఫూర్తితో పీజీ కోర్సును అభ్యసిస్తున్నాను.

-గుంటూరి దుర్గాదేవి, బీహెచ్ఎంఎస్ (ఎండీ హోమియో), సోమేశ్వరం

నేపాల్ బాధితులకు కంట్రోల్ రూమ్

రాజమహేంద్రవరం సిటీ: నేపాల్‌లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వ్యక్తులు, వారి బంధువులు ఎవరైనా అక్కడ ఇబ్బందులు పడుతుంటే తమకు తెలియజేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. ఆమె బుధవారం మాట్లాడుతూ అటువంటి వారికి సహాయం అందించేందుకు జిల్లా యంత్రాంగం తరఫున చర్యలు చేపడుతున్నామన్నారు. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో 24 గంటలూ పనిచేసేలా 89779 35611 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఏమైనా విషయం ఉంటే ఆ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే న్యూఢిల్లీలోని ఏపీ భవన్ 98183 95787, ఆంధ్రప్రదేశ్ హెల్ప్‌లైన్ 86323 40678, 85000 27678 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

క్లుప్తంగా

'నిర్కా'కు సీఎస్ఆర్ ప్రాజెక్టు



దాక్టర్ మాగంటి శేషు మాధవ్, నిర్కా డైరెక్టర్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలోని ఐకార్ – నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఆన్ కమర్షియల్ అగ్రికల్చర్ (నిర్కా)కు న్యూఢిల్లీకి చెందిన ఎం/ఎస్ ఎలైట్‌కాన్ ఇంటర్నేషనల్ సంస్థ నుంచి మొదటి సీఎస్ఆర్ ప్రాజెక్టు లభించింది. ఈ విషయాన్ని నిర్కా డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాజెక్టును తాను, క్రాప్ మేనేజ్‌మెంట్ డివిజన్ హెడ్ డాక్టర్ కొరడ రాజశేఖరరావు, బహుశాఖ శాస్త్రవేత్తల బృందంతో కలిసి ముందుకు తీసుకువెళతామన్నారు. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి వద్ద ఉన్న ఐకార్-నిర్కా ప్రాంతీయ కేంద్రంలోని పది ఎకరాల పొలంలో సాంకేతిక ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. రెండేళ్ల వ్యవధి కలిగిన ఈ ప్రాజెక్టులో భాగంగా సుమారు 500 మంది రైతులకు శిక్షణ ఇస్తామన్నారు. సెన్సార్లు, డ్రోన్లు రెండు మార్గాల సమాచార వ్యవస్థల ద్వారా పంట, పురుగుల వాతావరణాన్ని పర్యవేక్షించి రైతులకు తక్షణ సలహాలు అందించడం లక్ష్యమన్నారు. దీని ఫలితంగా నీటి వినియోగం 40–50 శాతం తగ్గడం, ఎనర్జీ వ్యయం 30–40 శాతం తగ్గడం, ఎరువుల సామర్థ్యం పెరగడం, ఉత్పాదకత మెరుగుపడడం, డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన పెరుగుతుందన్నారు.

మీడియాపై అక్రమ కేసులు సరికాదు

మీడియాపై అక్రమ కేసులు బనాయించడం ప్రజాస్వామ్య విరుద్ధం. ప్రజాస్వామ్యాన్ని, పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన ప్రభుత్వమే మీడియా ప్రతినిధులపై అక్రమంగా కేసులు పెట్టడం సరికాదు. 'సాక్షి' కార్యాలయంలో అర్ధరాత్రి పోలీసులు తనిఖీలు చేసి ఎడిటర్, రిపోర్టర్లపై తప్పుడు కేసులు నమోదు చేయడాన్ని ఖండిస్తున్నాం. రాసిన కథనాల్లో పొరపాట్లు ఉంటే వివరణ ఇవ్వాలని న్యాయపరంగా వెళ్లాలి. మీడియా ప్రతినిధులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి.

– మండెల శ్రీరామ్మూర్తి, రాష్ట్ర మాజీ కార్యదర్శి, ఏపీయూడబ్ల్యూజే, తూర్పుగోదావరి





కక్ష సాధింపు చర్యలు దారుణం

'సాక్షి' ఎడిటర్‌పై పోలీసులు కేసు నమోదు చేయడం, ఆ పత్రికా ప్రధాన కార్యాలయానికి వచ్చి కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం దారుణం. పోలీసు అధికారులకు న్యాయబద్ధంగా దక్కాల్సిన పదోన్నతులు కల్పించలేదనే విషయాన్ని సాక్షి పత్రిక వెలుగులోకి తెచ్చింది. దీంతో పోలీసులు ఆ కార్యాలయంలో అర్ధరాత్రి హడావుడి చేయడం తగదు. తగిన ఆధారాలు, వాస్తవాలు ఉంటే కేసులు నమోదు చేసుకున్నా పర్వాలేదు. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డిపై వరసగా కేసులు నమోదు చేసి వేధించడమంటే పత్రికా స్వేచ్ఛపై దాడి జరిగినట్టే. – ఎమ్మెన్వీ ప్రసాద్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, అమలాపురం



ట్యాబ్.. స్వీచ్ఛాఫ్

- బోధనకు కూటమి మంగళం
- గత ప్రభుత్వంలో విద్యార్థులకు పంపిణీ
- పట్టించుకోని ప్రస్తుత పాలకులు



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

కొత్తపేట: ప్రతి విద్యార్థి ఉన్నతంగా చదవాలి, ప్రపంచంతో పోటీ పడాలి అనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అడుగులు వేసింది. దానిలో భాగంగానే ప్రభుత్వ విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. విద్యావ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచింది. ముఖ్యంగా సాంకేతిక విద్యపై విద్యార్థులు మక్కువ పెంచుకునేలా పథకాలు అమలు చేసింది. కోట్ల రూపాయలు వెచ్చించి 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఉచితంగా అందజేసింది. వాటి ద్వారా విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు ప్రోత్సాహం అందించింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ట్యాబ్‌లతో విద్యాబోధనకు మంగళం పాడింది.

జగన్ ముద్ర కనిపించకుండా..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను గమనిస్తే గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను తుంగలో తొక్కి, వాటి ముద్ర కనిపించకుండా చేసే లక్ష్యంతోనే పరిపాలన సాగిస్తున్నట్టు తేటతెల్లమవుతోంది. గత ప్రభుత్వం అమలు చేసిన ప్రజా ప్రయోజన పథకాలను కొనసాగించి, హుందాగా వ్యవహరించడానికి బదులు రాజకీయాలకు పాల్పడుతోందని విశ్లేషకులు విమర్శిస్తున్నారు. కేవలం కక్ష సాధింపు ధోరణితో ముందుకు వెళుతోందన్నారు.

పేద విద్యార్థులపై చిన్నచూపు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది.

కోనసీమ జిల్లా సమాచారం

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు	1,266
ప్రాథమికోన్నత పాఠశాలలు	45
ఉన్నత పాఠశాలలు	252
మొత్తం పాఠశాలలు	1,563
1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు	89,672
రెండేళ్లలో విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లు	30,379
ట్యాబ్‌లకు ఖర్చు చేసిన మొత్తం	రూ.97.21 కోట్లు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2022–23 సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ ప్రారంభించింది. రెండేళ్ల పాటు అందజేసింది. ఉపాధ్యాయులు ఆ ట్యాబ్‌ల ద్వారా అత్యాధునిక సాంకేతికతతో పాఠ్యాంశాలు బోధించేవారు. వాటితో విద్యార్థులు చక్కగా చదువుకునేవారు. ట్యాబ్‌ల వినియోగం కోసం పాఠశాలల్లో ఇంటర్నెట్ సదుపాయం కూడా కల్పించారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక కనీస పర్యవేక్షణ, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయకపోవడం, బైజూస్ ఒప్పందం ముగియడం, మళ్లీ రెన్యువల్ చేసుకోకపోవడం ద్వారా ట్యాబ్ విద్యాబోధనను నిర్వీర్యం చేసింది. ఫలితంగా అవి మూలనపడ్డాయి.

ఒక్కో ట్యాబ్‌కు రూ.32 వేల ఖర్చు

గత ప్రభుత్వంలో 8వ తరగతి విద్యార్థులందరికీ ఉచితంగా ట్యాబ్‌లు అందజేశారు. వాటిలో బైజూస్ కంటెంట్‌తో కూడిన వీడియోలు పొందుపరిచారు. ఇవి పదో తరగతి వరకూ ఉపయోగపడేలా రూపొందించారు. దీని కోసం ఒక్కో ట్యాబ్‌పై సుమారు రూ.32 వేలు ఖర్చు చేశారు. 2023–24లో ట్యాబ్‌లు తీసుకున్న విద్యార్థులు ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నారు. తమ వద్ద ఉన్న ట్యాబ్‌లు సాఫ్ట్‌వేర్ సమస్యలతో మొరాయిస్తున్నాయని వారు తెలిపారు. ఈ సమస్యను ఉపాధ్యాయులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఎటువంటి స్పందన లేదన్నారు.

పునరుద్ధరించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థుల అభ్యున్నతికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన ట్యాబ్ విద్యాబోధనను కొనసాగించాలి. గతంలో ఇచ్చిన ట్యాబ్‌లు ప్రస్తుతం అప్‌డేట్ సమస్యతో పనిచేయడం లేదు. గత ప్రభుత్వం ఆ ట్యాబ్‌లను ఇచ్చిందన్న కారణంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని పట్టించుకోవడం లేదు. ఈ విధానం సరైంది కాదు. ట్యాబ్ విద్యాబోధనను వెంటనే పునరుద్ధరించాలి.

– నేరేడుమిల్లి నరేష్, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం కొత్తపేట మండల అధ్యక్షుడు, గంటి

నెరవేరని లక్ష్యం



గత ప్రభుత్వం హయాంలో విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లు ఎంతో ఉపయోగంగా ఉండేవి. దేశంలో మరెక్కడా విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చిన దాఖలాలు లేవు. పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం వాటిని సాంకేతికతతో రూపొందించారు. 2023–24లో ట్యాబ్‌లు పొందిన విద్యార్థులు ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నారు. అయితే వారి వద్ద ఉన్న ట్యాబ్‌లు పనిచేయక గత ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండా పోయింది.

– కేపీసీహెచ్ సూర్యారావు, యూటీఎఫ్ కొత్తపేట మండల అధ్యక్షుడు

నేడు ఈటీసీ నిర్వహణ కమిటీ సమావేశం

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ) నిర్వహణ కమిటీ సమావేశం పంచాయతీరాజ్ కమిషనర్ రేవు ముత్యాలరావు అధ్యక్షతన గురువారం జరుగుతుందని ప్రిన్సిపాల్ కేఎస్‌వీ ప్రసాదరావు తెలిపారు. ఈ సమావేశంలో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల సీఈఓలు, శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న 11 కొత్త జిల్లాల్లోని డీపీఓలు, ఎస్ఐఆర్‌డీ రాష్ట్ర సమన్వయకర్త, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశానికి ఈటీసీ ప్రిన్సిపాల్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారన్నారు. విస్తరణ శిక్షణ కేంద్రంలో శిక్షణలు, అభివృద్ధి పనులను సమీక్షించడం, వార్షిక శిక్షణ ప్రణాళికను ఆమోదించడం, భవిష్యత్తు కార్యాచరణపై చర్చిస్తారన్నారు.

13న కాకినాడ జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

సామర్లకోట: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే కాకినాడ జిల్లా జట్లను ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఎంపిక చేస్తామని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ కాకినాడ పీఆర్ కళాశాల ఇండోర్ కబడ్డీ కోర్టులో జూనియర్ బాలుర, బాలికల జట్ల ఎంపిక జరుగుతుందన్నారు. దీనికి హాజరయ్యే క్రీడాకారులు 2006 డిసెంబర్ 31 తర్వాత పుట్టిన వారై ఉండి, బాలురు 75 కేజీలు, బాలికలు 65 కేజీల లోపు బరువు ఉండాలన్నారు. జిల్లా నుంచి వచ్చిన క్రీడాకారులకు పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైనవారు ఈ నెల 22 నుంచి 25 వరకూ ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆధార్ కార్డు, పదో తరగతి మార్కుల జాబితాతో రావాలని కోరారు.

పనులకు కదలిక

- వీరేశ్వరస్వామి ఆలయం పరిశీలన
- పునర్నిర్మాణానికి సూచనలు

సాక్షి ఇంపాక్ట్



వీరేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న దేవస్థానం అధికారులు

ఐ.పోలవరం: వర్షం వస్తే నీటి వెతలు.. ఆపై మురమళ్ల వీరేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి కానరాని చర్యలపై 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనంతో అధికారుల్లో కదలిక వచ్చింది. రూ.నాలుగు కోట్లతో ఆలయ పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసినా పనులు ప్రారంభించకపోవడం, ఆపై వర్షం వస్తే ఆలయంలో ముంపు సమస్యలపై 'స్వామీ.. నీ చెంత నీరేమీ' అనే శీర్షికన ఈ నెల 8న 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఇందులో భాగంగా దేవదాయ శాఖ రాష్ట్ర స్థపతి పరమేశ్వరప్పతో పాటు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డిప్యూటీ స్థపతి, అసిస్టెంట్ స్థపతి, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణతో కలసి బుధవారం ఆలయాన్ని పరిశీలించారు. గర్భాలయం, అంతరాలయం, ముఖ మండపం, గాలి గోపురం, చండీశ్వర స్వామి, నవగ్రహ మండపాలను పరిశీలించారు. ఆలయ పునర్నిర్మాణానికి చేసిన ప్లాన్‌ను వారు పరిశీలించి తగు సూచనలు చేశారు. తొలుత వీరికి ఆలయ మర్యాదలతో సిబ్బంది స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

- జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు
- కాకినాడలో స్థాయీ సంఘ సమావేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): క్షేత్రస్థాయిలో ప్రజా అవసరాలపై సభ్యులు లేవనెత్తిన అంశాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి సారించాలని జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్థాయీసంఘ సమావేశాలు చైర్మన్ వేణుగోపాలరావు, ఆయా సంఘాల చైర్మన్ల అధ్యక్షతన జరిగాయి. వీటికి శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు, కుడుపూడి సూర్యనారాయణరావు హాజరయ్యారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో అమలవుతున్న ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని ఆయా అంశాల స్థాయి సంఘాలు సమీక్షించాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు అధికారులకు సూచనలు చేశాయి. తొలుత రామచంద్రపురం మండలం జెడ్పీటీసీ సభ్యులు ఎం.వెంకటేశ్వరరావు ఆగస్టులో మృతి చెందిన నేపథ్యంలో సభలో మౌనం పాటించారు.

- అక్షరాంధ్ర కార్యక్రమానికి సంబంధించి జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, జిల్లా వయోజన విద్యాశాఖ డీడీ పోశయ్యలతో కలిసి గౌరవ సభ్యులందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అక్షరాంధ్ర వయోజన విద్య పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రస్తుత ఖరీఫ్, రానున్న రబీ సీజన్లకు కాలువల ద్వారా నీరు సక్రమంగా పంట పొలాలకు అందేలా చూడడంతో పాటు అకాల వర్షాల వల్ల పొలాలు ముంపునకు గురి కాకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని గౌరవ సభ్యులు అధికారులను కోరారు.
- వైద్య,ఆరోగ్యశాఖకు సంబంధించి సీజనల్ వ్యాధుల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన వైద్య అధికారులు పారా మెడికల్ సిబ్బందిని నియమించాలని కోరారు.
- రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని శాసన మండలి సభ్యుడు సోము వీర్రాజు అధికారులకు సూచించారు. మోతాదుకు మించి యూరియా వినియోగించడం వల్ల అనేక రోగాల బారిన ప్రజలు పడుతున్నారని, ఈ అంశంపై రైతులకు అధికారులు అవగాహన కలిగించాలన్నారు.
- అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు అవసరమైనంత యూరియా అందుబాటులో ఉండేలా శాసన మండలి సభ్యులు కుడుపూడి సూర్యనారాయణరావు కోరారు.

తాటాకిల్లు దగ్ధం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన ఇల్లు

కొత్తపల్లి: ప్రమాదవశాత్తూ గ్యాస్ సిలిండర్ పేలి తాటాకిల్లు దగ్ధమైన సంఘటన కొండెవరంలో జరిగింది. బాధితుడు పెంకే సత్తిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తిబాబు కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రించాడు. అర్ధరాత్రి దాటాక ఒక్కసారిగా సిలిండర్ పేలింది. దీంతో ఇంట్లో వారందరూ బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనలో తాటాకిల్లు, దానిలోని గృహోపకరణాలు కాలిబూడిదయ్యాయి. సమాచారం అందుకున్న పిఠాపురం ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి పి.హరిప్రసాద్, సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని అంచనా వేశారు.

పేకాట శిబిరంపై దాడి



జూదరులను అదుపులోకి తీసుకున్న సీఐ సుమంత్, ఎస్సై రవిచంద్ర తదితరులు

బిక్కవోలు: పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురు జూదరులను అరెస్ట్ చేశామని అనపర్తి సీఐ వీఎల్‌వీకే సుమంత్ తెలిపారు. కొమరిపాలెంలోని ఒక చావిడిలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో బుధవారం తెల్లవారుజామున బిక్కవోలు ఎస్సై రవిచంద్ర, సిబ్బందితో దాడి చేశామన్నారు. అక్కడ పేకాట ఆడుతున్న ఏడుగురితో పాటు, చావిడి యజమానిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి నాలుగు మోటారు సైకిళ్లు, రూ.34,790 స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

నాణ్యమైన సరకులే సరఫరా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నందాజీ, చిత్రంలో ఈఓ వీర్ల సుబ్బారావు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి నాణ్యమైన బియ్యం, పప్పులు, ఇతర దినుసులను సరఫరా చేయాలని టెండర్ దారులకు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జీఏబీ నందాజీ సూచించారు. ఇటీవల దేవస్థానానికి బియ్యం, పప్పులు, ఇతర దినుసులు సరఫరా చేయడానికి టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయగా సుమారు పది మంది టెండర్లు దాఖలు చేశారు. ఆ టెండర్లు తెరవడానికి ముందు దేవస్థానంలో ప్రీ బిడ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నందాజీ మాట్లాడుతూ సరఫరాదారులు పంపించిన సరకుల్లో నాణ్యమైనవని తమ పరీక్షల్లో తేలితేనే, వాటిని దేవస్థానంలో ఉపయోగించేందుకు అనుమతిస్తామన్నారు. లేకపోతే వెనక్కి పంపించేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పి.కేశవ్ దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో ఒత్తిడి నుంచి ఉపశమనం



క్రికెట్ ప్రాక్టీస్ నెట్‌ను ప్రారంభిస్తున్న మూడో అదనపు జిల్లా జడ్జి ఆనంది

కాకినాడ లీగల్: న్యాయవాదులు వృత్తిలో ఎక్కువ ఒత్తిడికి గురవుతుంటారని, దాని నుంచి ఉపశమనం పొందేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి జి.ఆనంది అన్నారు. కోర్టు ఆవరణలో రూ.3 లక్షలతో నిర్మించిన క్రికెట్ ప్రాక్టీస్ నెట్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. వాటి ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందన్నారు. క్రికెట్ నెట్ ద్వారా న్యాయవాదులు తమ క్రికెట్ నైపుణ్యాలను మెరుగుపరచుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా ఆరో అదనపు జిల్లా జడ్జి పి.గోవర్ధన్ బౌలింగ్ చేయగా, జడ్జి ఆనంది బ్యాటింగ్ చేశారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి సుబ్రహ్మణ్యం, చెక్కపల్లి వీరభద్రరావు, ఉపాధ్యక్షుడు పెన్మెత్స రామచంద్రరాజు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ జోకా విజయ్ కుమార్, తలాటం హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏమైందో ఏమో!



పెద్దేవంలో గుర్రపు డెక్కతో నిండిన చెరువు



రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న పశువైద్యాధికారి బాలాజీ

- పెద్దేవంలో గేదెల మృత్యువాత
- 15 రోజుల్లో 25 మరణించిన వైనం
- ఆందోళనలో పాడి రైతులు

తాళ్లపూడి: పెద్దేవం గ్రామంలో పాడి పశువులు (గేదెలు) వరసగా మృత్యువాత పడుతున్నాయి. గత 15 రోజుల వ్యవధిలో సుమారు 25 వరకూ గేదెలు మరణించాయి. ఆకస్మాత్తుగా నీరసపడి, రెండు రోజులకే అవి మేత మేయక చనిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. ఇలా ఎందుకు జరుగుతుందో తెలియక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని సాయిబాబా, ఇతర ఆలయాల సమీపంలో సుగంధి చెరువు ఉంది. దీని నీటిని పశువులు తాగుతాయి. అయితే చెరువు నీరు కలుషితం కావడం, ఆ నీటిని పశువులు తాగడం వల్లే చనిపోతున్నాయని కొందరు అభిప్రాయపడుతున్నారు. గతంలో తాగునీటికి ఉపయోగించిన ఈ చెరువు నేడు గుర్రపు డెక్క పేరుకుపోయి అధ్వానంగా మారింది. దానిలో మలమూత్ర విసర్జనలు, మృత కళేబరాలను వేస్తున్నారు. కాగా.. తమ గ్రామంలో పశువులు ఎందుకు చనిపోతున్నాయో తెలియడం లేదని రైతులు జమ్ముల శ్రీను, బెల్లంకొండ సోమన్న, యాండపల్లి లక్ష్మణరావు, నామన సుబ్బారావు తదితరులు ఆందోళన చెందుతున్నారు.

నమూనాల సేకరణ

పశుసంవర్ధకశాఖ మండల అధికారి బాలాజీ బుధవారం పెద్దేవంలో పర్యటించి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశువులకు వచ్చిన రోగ లక్షణాలు కొత్తగా ఉన్నాయని, కిడ్నీ, లివర్ దెబ్బ తింటున్నాయన్నారు. తీసుకునే ఆహారం కానీ, తాగే నీరు కానీ కలుషితమై ఉండచ్చన్నారు. గడ్డి, నీరు, రక్త నమూనాలను పరీక్షలకు పంపామని, ఫలితాలు వచ్చాక విషయం తెలుస్తుందన్నారు.

అశ్వత్థానికి దీపపు సెగ



రావిచెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

అన్నవరం: రత్నగిరికి వచ్చే భక్తుల అనాలోచిత చర్యలు ఆలయ ఆవరణలోని త్రిమూర్తి స్వరూపమైన భారీ అశ్వత్థ వృక్షానికి (రావిచెట్టు) చేటు చేస్తున్నాయి. ఆలయ ఆవరణలో సుమారు 50 ఏళ్ల పైబడిన ఉన్న ఆ వృక్షం చుట్టూ భక్తులు ఆవునేతితో దీపాలు పెట్టి ప్రదక్షిణలు చేస్తుంటారు. నిత్యం తెల్లవారు ఝాము నుంచి సాయంత్రం వరకు సాధారణ రోజుల్లో ఐదు వేల నుంచీ పర్వదినాల్లో 25 వేలకు పైబడి దీపాలు ఆ వృక్షం చుట్టూ వెలిగిస్తుంటారు. దీంతో సాధారణంగానే ఆ చెట్టు మాను తీవ్రంగా వేడెక్కిపోతుంది. ఈ నేపథ్యంలో దీపాలను ఆ వృక్షానికి ఇబ్బంది లేనంత దూరంలో వెలిగించుకునే ఏర్పాట్లను అధికారులు చేయాల్సి ఉంది.

గతంలో మాను చుట్టూ రేకు ఏర్పాటు

గతంలో దీపాల సెగ వృక్షం మానుకు తగలకుండా చుట్టూ రేకు అమర్చేవారు. అలాగే మాను మొదట్లో నీరు పోసి తడిపే వారు. ఇప్పుడు ఆ చర్యలేమీ లేవు. ఇప్పటికైనా ఆ చర్యలను పునరావృతం చేసి మానుకు వేడి తగలకుండా రక్షణ కంచె ఏర్పాటు చేయాల్సి ఉంది. అలాగే దీపాలు కొండెక్కాక వాటిని అక్కడి నుంచి తొలగిస్తే చాలా ప్రయోజనం ఉంటుంది.

హోటల్‌లో తనిఖీలు



అధికారులు తనిఖీ నిర్వహించిన హోటల్

గండేపల్లి: జిల్లా గూడ్స్, సర్వీస్ టాక్స్ జిల్లా ఇంటెలిజెన్స్ విభాగం డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక హోటల్‌లో బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. మల్లేపల్లి శివారు రాయుడు గారి మిలటరీ హోటల్లో (ఆంధ్రాస్ లార్జెస్ట్ రెస్టారెంట్) అధికారులు సుమారు ఉదయం 11.45 నుంచి తనిఖీలు ప్రారంభించారు. తనిఖీలకు వచ్చిన అధికారులే స్వయంగా వినియోగదారుల నుంచి బిల్లులు తీసుకున్నారు. తనిఖీ జరుగుతున్నంతసేపు మీడియాను అనుమతించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సాయంత్రం 7 గంటల వరకు తనిఖీ చేసిన అధికారులు మీడియాకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అత్యంత గోప్యత ప్రదర్శించి వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది. కాగా వారంతా జీఎస్టీ వివరాలు తనిఖీ చేసేందుకు వచ్చినట్టు స్థానికంగా భావిస్తున్నారు.